మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
మనూర్ మండల పరిధిలోని దుధగొండ గ్రామ పంచాయతీ పరిధిలోని గట్లెలింగంపల్లి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా 5లక్షల రూపాయలు వారికి విడతల వారీగా ఇచ్చి వారి సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో ఆలోచించి ఆ కార్యక్రమంలో భాగంగా ఈరోజు గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు బ్రహ్మానందరెడ్డి, రాజు మాజీ సర్పంచ్, ధనరాజ్ పాటిల్, సంజీవరెడ్డి దుధగొండ గ్రామపెద్దలు కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు

**ములుగు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ములుగు మండలపరిధిలోని శ్రీరాంపూర్‌గ్రామ కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు ఎండల స్వామి, నాయకులు హరివర్దన్, మధు, గణేష్, నరేష్‌తోపాటు పలువురు యువకులు శనివారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జహంగీర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చినతర్వాత ఇచ్చినహామీలు ప్రజలకు అందించడంలో విఫలమైందని కెసిఆర్ నాయకత్వంలో పనిచేయాలని బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, రాష్ట్ర యువజనవిభాగం ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, మాజీ జెడ్‌పిటిసి జయమ్మ అర్జున్‌గౌడ్, మాజీ ఎంపిపి లావణ్య అంజన్‌గౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, బిఆర్ఎస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ కొమ్ము నవీన్‌కుమార్, భూపాల్‌రెడ్డి, బాలేష్, రవి, కనకేష్, సుదర్శన్, చంద్రశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి చొరవతో హుస్నాబాద్‌కు చేరిన గల్ఫ్ బాధితుడు


హైదరాబాద్ ఏయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులను కలిసిన గల్ఫ్ బాధితుడు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
నెలరోజుల క్రితం గల్ఫ్‌దేశానికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతూ తనను స్వదేశం తీసుకురావాలని కోరుతూ హుస్నాబాద్ పట్టణానికి చెందిన చొప్పరి లింగయ్య వారంరోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌లకు సెల్ఫీ వీడియో ద్వారా విజ్ఞప్తి చేయగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ చొప్పరి లింగయ్యకు రాష్ట్రప్రభుత్వం నియమించిన ఎన్ఆర్ఐ అడ్వైజరీకమిటీ చైర్మన్ వినోద్‌కుమార్, వైస్‌చైర్మన్ మంద భీమ్‌రెడ్డిలను సమన్వయం చేశారు. మంత్రి పొన్నం ఆదేశాలమేరకు బాధితుని వద్దకు వెళ్లిన ప్రతినిధులు తన కంపనీ యాజమాన్యంతో మాట్లాడి తనకు పూర్తిస్థాయి వైద్యం చేయించి శనివారం హుస్నాబాద్‌కు చేరేవిధంగా కృషి చేశారు. అయితే లింగయ్య హుస్నాబాద్‌కు చేరుకునేందుకు విమానం టికెట్‌తో పాటు దారి ఖర్చులను మంత్రి పొన్నం ప్రభాకర్ భరించినట్లు బాధితుడు తెలిపారు. హుస్నాబాద్‌కు చేరుకున్న లింగయ్య మంత్రి పొన్నంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సాయినగర్ కాలనీలో బస్తీదర్శన్

-ప్రజా సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్ పుష్పనగేష్


సాయినగర్ కాలనీలో బస్తీదర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేశ్

**రామచంద్రాపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
బస్తీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీసాయి నగర్ కాలనీలో నిర్వహించిన బస్తీదర్శన్ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎఎంఓహెచ్ విజయ్‌మోహన్, ఎస్ఎస్ పవన్, జిహెచ్ఎంసి శానిటేషన్ జలమండలి విభాగ అధికారులు, సిబ్బందితో కలిసి కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్య మ్యాన్‌హోల్‌లో ఉన్న స్టీల్‌ను తొలగింపచేశామన్నారు. కాలనీలో నెలకొన్నసమస్యలను పరిష్కరిస్తానని, అందుకు సంబంధిత అధికారులకు పలుసూచనలు చేశారు. కాలనీ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, చెత్తను రోడ్డుపైవేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. కాలనీలో సిసి రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్ కావాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, ప్రతిపాదనలు చేయించి నిధులు మంజూరు అయ్యేలా చేస్తానని కాలనీవాసులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, బ్రహ్మారాజు, చెన్నప్ప, చంద్రమౌళి, శంకర్, మురళి, మనోహర్, నాగరాజు, రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన


కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండల పరిధి రుద్రారం, శాలిపేట, గవ్వలపల్లిలో ఐకెపి, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలుకేంద్రాలను తహసీల్దార్ మన్నన్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం ధాన్యం తూకం పరిశీలించారు. బార్ధాని, లారీల కొరతలేకుండా చూసుకోవాలన్నారు. ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పకడ్బందీగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. రిజిస్టర్లను పరిశీలించారు. రైస్ మిల్లులకు తరలిస్తున్న ధాన్యాన్ని పరిశీలించారు.

## చలో వరంగల్ కార్యక్రమం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ఈనెల 27న ఆదివారం నిర్వహించే చలో వరంగల్ కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని ఆమె స్వగృహంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన టిఆర్ఎస్ పార్టీ 20 సంవత్సరాలు గడిచినందున వరంగల్లో బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ మాజీ సిఎం కె.చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు నర్సాపూర్ నియోజక వర్గం నుండి సుమారు 5000మంది బిఆర్ఎస్ నాయకులను తరలించనున్నట్లు ఆమె తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం సాధించి తెలంగాణలో అధికారం చేపట్టిందన్నారు. మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం రావాలని, కెసిఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే సునీతారెడ్డి వెల్లడించారు. ఈమేరకు వరంగల్‌లో జరిగే టిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నహీముద్దీన్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, మాజీ కౌన్సిలర్ పంబల రామచందర్, పట్టణ అధ్యక్షులు పంబల బిక్షపతి, టిఆర్ఎస్ నాయకులు జితేందర్‌రెడ్డి, రింగుల ప్రసాద్, సూరారం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంతో అధికార వికేంద్రీకరణ

-పారదర్శకత, జవాబుదారీతనమే భూభారతి చట్టం ముఖ్య ఉద్దేశం
-రైతులకు అత్యంత ప్రతిష్టాత్మకమైనది భూభారతి చట్టం
-సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు


జ్యోతి ప్రజ్వలనతో భూభారతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**పటాన్‌చెరు, రామచంద్రాపురం ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
భూభారతి (భూమి హక్కుల చట్టం2025)ను రైతులందరూ సద్వినియోగంచేసుకోవాలని సంగారెడ్డిజిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శనివారం పటాన్‌చెరుపట్టణంలోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్, అమీన్‌పూర్ మండలానికి సంబంధించి బాలాజీ కన్వెన్షన్‌హాల్లో భూభారతి అవగాహన సదస్సులో జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాధికారులతో కలెక్టర్ పాల్గొన్నారు. పటాన్‌చెరు అంబేద్కర్ ఫంక్షన్‌హాల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భూభారతి, నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ..భూభారతిచట్టంతో అధికారుల వికేంద్రీకరణ జరిగిందని, పారదర్శకత జవాబుదారీతనమే ఈచట్టం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. భూసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా భూభారతి(ఆర్ఓఆర్) చట్టం 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరాలన్నారు. రైతులు, ప్రజల మేలుకోసం ఈచట్టాన్ని తీసుకువచ్చారని, భూసమస్యలు లేనిజిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు. భూభారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో అవగాహనసదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం భూభారతి చట్టంతోపాటు, నియమ నిబంధనలు ఒకేసారి తయారు చేసిందని, రికార్డుల నిర్వహణ, సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సాదా బైనామా, పౌతి వంటి అంశాలను కలెక్టర్ వివరించారు. ధరణిలోని సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతుల సంక్షేమం కోసం తీసుకువచ్చిన భూభారతి చట్టంపై పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాస్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని కలెక్టర్ అన్నారు. ప్రజలందరికీ ఉచిత న్యాయసేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాల తహసీల్దార్లు రంగారావు, సంగ్రంరెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు సంఘ నాయకులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

-జిల్లాస్థాయిలోనే సమస్యల పరిష్కారం
-జిల్లాకలెక్టర్ మనుచౌదరి



భూభారతి అవగహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ మనుచౌదరి

**కొండపాక, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
జిల్లాస్థాయిలోనే భూసమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం భూభారతి 2025చట్టం తీసుకొచ్చిందని జిల్లాకలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో, కొండపాక మండలకేంద్రంలోని ప్రభుత్వ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో ఆయన అదనపుకలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం ఏప్రిల్14న 2025న భూభారతి చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. రాష్ట్రంలో నాలుగుజిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గాతీసుకొని రైతులనుండి దరఖాస్తులు తీసుకుంటుందన్నారు. ఆదరఖాస్తులను పరిశీలించిన తర్వాత అన్నిజిల్లాల్లో రెవెన్యూసదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తుందని తెలిపారు. చట్టం అందరికీ అనుకూలంగా ఉందన్నారు. సాదా బైనామాల్లో తెల్లకాగితం మీద భూవిక్రయాలు జరిగిన వాటి గురించి భూభారతిలో కొత్తచట్టం తీసుకొచ్చారని వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో ఒకరి మీద మరొకరురావడం, వారసత్వపరమైన వాటికి ఈచట్టంలో వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈచట్టం వల్ల కోర్టుకు పోయే కేసులు 99శాతం తగ్గుతాయని తెలిపారు. గతంలో అన్యాక్రాంతం అయిన భూములనుకూడా ప్రభుత్వ అధీనంలోకి తిరిగి తీసుకొనే అవకాశం ఉందన్నారు. అసైన్‌మెంటు భూములు లబ్దిదారులు, హక్కుల మార్పిడికి సంబంధించి పూర్తివివరాలను అందులో పొందుపర్చడం జరిగిందన్నారు. భూభారతి అవగాహన సదస్సులద్వారా వచ్చిన సలహాలను, సూచనలను ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందన్నారు. మనిషికి గుర్తింపు ఆధార్, భూమికి భూదార్‌కార్డు అన్నారు. ఇందులో భూమి హద్దులు జిపిఆర్ఎస్‌లో పొందుపరిచేవిధంగా ఈకార్డు ఉపయోగపడుతుందని దీనిద్వారా భూ అక్రమాలను నివారించవచ్చునని తెలిపారు. గ్రామస్థాయిలో నిర్వహించే రికార్డులు, పట్టదారు,రైతు, ఇతరులు రికార్డులుకావాలని దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలో తీసుకునే వెసులుబాటు ఈ చట్టంలో ఉందన్నారు. ఈకార్యక్రమాల్లో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్‌లు సుజాత, దిలీప్‌కుమార్, ఎంపిడిఓలు వెంకటేశ్వర్లు, రాం ప్రసాద్, అధికారులు నాగరాజు, మార్కెట్‌కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్‌లు, పిఎసిఎస్ డైరెక్టర్‌లు, ఎఈఒలు, ఈజిఎస్ సబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో నీటి కొరత ఏర్పడకుండా చూసుకోవాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**సిద్దిపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త ప్రతినిధి:**
వాతావరణ మార్పుల వల్ల నీటి వనరులు తరిగిపోతున్న నేపథ్యంలో జిల్లాలో నీటి కొరత ఏర్పడకుండా ఉండేందుకు జిల్లా స్థాయిలో వాచ్‌డాగ్ కమిటీలు పనిచేయాలని స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐఓసి కార్యాలయంలో జిల్లాస్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌పై సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాలు మంజూరు చేయకుంటే ముందే 300చదరపు మీటర్ల కంటే ఎక్కువ ప్లాట్ ఏరియా ఉన్న భవనాలకు హార్వెస్టింగ్‌స్ట్రక్చర్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి భవనం నుండి వచ్చే వ్యర్థ జలాలు రీసైక్లింగ్ ప్లాంట్‌లను కలిగి ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో వాచ్‌డాగ్ కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎక్కువనీరు వృథా అయ్యే ప్రదేశాలను, భవనాలను గుర్తించి నీటిసంరక్షణచర్యలు చేపట్టాలన్నారు. అవసరమైనచోట వాల్టాచట్టాన్ని అమలు చేయాలని, నీటి ఎద్దడి ఉన్న ప్రదేశాలలో ప్రజలకు నీటిని సరఫరా చేయాలన్నారు. ఈనెలలో ఎల్ఆర్ఎస్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో వచ్చిన దరఖాస్తులపై చర్యలు వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ అధికంగా ఉన్న చోట అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో డిపివో దేవకీదేవి, డిఆర్డీవో జగదేవ్ ఆర్యతోపాటు మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్ తదితరులు ఉన్నారు.

## ఎల్లారెడ్డిగూడా తండాలో తాగునీటి ఎద్దడి

-పట్టించుకునే నాథుడే కరువు
-తాగునీటికి అవస్థలు పడుతున్న తండావాసులు
-వ్యవసాయ బోరుబావులే శరణ్యం


వ్యవసాయ బోర్‌బావుల నుండి నీరు తెచ్చుకుంటున్న గిరిజన తండావాసులు

**నర్సాపూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడా తండా గ్రామ పంచాయతీ పరిధిలోగల నాలుగు గిరిజన తండాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండగా, పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఎల్లారెడ్డిగూడా తండా గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగుతండాల్లో తాగునీటికి తండావాసులు అనేక అవస్థలు పడుతున్నారు. మిషన్‌భగీరథ నీళ్లు వస్తేతప్ప ఈతండాలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు తొలగవు. చేసేదేమీ లేక తండావాసులు వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తూ తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఈవిషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి పట్టించుకోవడంలేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు వినతిచేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ సంతోషా బిక్కునాయక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు తండాల్లో తీవ్రంగా నీటి ఎద్దడినెలకొంది అని అన్నారు. పంచాయతీ కార్యదర్శి అసలు పట్టించుకోవడంలేదని అన్నారు. నీటి సమస్య ఉన్నందున ట్యాంకర్లతో నీళ్ళు తెప్పించడం లేదని, సింగిల్ మోటార్‌ను, స్మశానవాటిక వద్ద ఉన్న పెద్ద బోర్ మోటార్‌ను బాగు చేయించడంలేదని దీంతో ఈ తండాల్లో తాగునీటి సమస్య నెలకొందన్నారు. ఈసమస్యతో తండావాసులు తిప్పలుపడుతూ వ్యవసాయ బోర్‌బావులను ఆశ్రయిస్తూ తాగునీటిని తెచ్చుకుంటున్నారని అన్నారు. అంతేగాక గ్రామపంచాయతీ సమావేశాన్ని నిర్వహించడం లేదని. అదేవిధంగా పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతో వాటర్ ట్యాంకులు శుభ్రపరచకపోవడంతో ట్యాంకుల్లో చెత్త నిండిపోయింది అన్నారు. మురికి కాలువలు వీధులను పరిశుభ్రం చేయడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎల్లారెడ్డిగూడా తండా గ్రామపంచాయతీలో నెలకొన్న తాగునీటిసమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో ఏసిబి తనిఖీలు

-గంటల తరబడి కొనసాగుతున్న సోదాలు
-భారీగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన అధికారులు


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీచేస్తున్న అధికారులు

**మర్కుక్/గజ్వేల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని, గతంలో ఈఎన్‌సిగా విధులు నిర్వహించిన హరిరామ్‌పై కేసు నమోదుచేయడంతోపాటు శనివారం మండల కేంద్రం మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసిబి డిఎస్పీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్లు కొండా రమేష్, వెంకటేశ్వర్లు సిబ్బందితోకలిసి తనిఖీలు నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మానసపుత్రిక అయినటువంటి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఈఎన్‌సి హరిరామ్‌పై ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు కేసు నమోదుచేయగా శనివారం ఏకకాలంలో 14 చోట్ల ఏసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. అందులోభాగంగానే మర్కుక్ మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 6 గంటల నుండి సుమారు అర్థరాత్రి వరకు ఏసిబి అధికారులు పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించి అతని పేరుపై ఉన్న కొన్ని డాక్యుమెంట్లను గుర్తించినట్లు సమాచారం. మర్కుక్‌మండలంలో అతనికిసంబంధించి సుమారు 32 ఎకరాలను గుర్తించినట్లు తెలిసింది. అలాగే నీటిపారుదలశాఖలో డిప్యూటీ ఈఎన్‌సిగా విధులు నిర్వహిస్తున్న హరిరామ్ సతీమణి అనిత పేరుపై మర్కుక్ మండలంలో 30 ఎకరాల్లో ఫాంహౌజ్ ఉన్నట్లు, హైద్రాబాద్‌లో లగ్జరీ ప్లాట్లతో పాటు అనేక ఆస్తులను గుర్తించినట్లు తెలిసింది. ఏకకాలంలో ఏసిబి దాడులతో మాజీ ఈఎన్‌సి హరిరామ్ సంపాదించిన అక్రమ ఆస్తులవివరాలు బయట పడుతున్నాయి. బిఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్దఎత్తున అవినీతిజరిగిందని ఆరోపణలు వస్తున్నక్రమంలో కాంగ్రెస్‌ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో విధులు నిర్వహించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించి విచారణలు జరుపుతుంది.

## మధ్యాహ్నభోజన కార్మికులకు తగినవేతనం అందించాలి

**బెజ్జంకి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మధ్యాహ్నభోజన కార్మికులకు శ్రమకుతగ్గ వేతనం అందించాలని మధ్యాహ్నభోజన కార్మికులసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో మధ్యాహ్నభోజన కార్మికుల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్నభోజన కార్మికులకు కనీసవేతన చట్టం అమలుచేయాలని శ్రమకుతగ్గ వేతనాలు చెల్లించాలని సుప్రీం కోర్టు చెప్పిన ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం చెల్లించకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం మధ్యాహ్నభోజన కార్మికులసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొంపల్లి తిరుపతి, ఉపాధ్యక్షులుగా సంఘం విజయ, ప్రధాన కార్యదర్శిగా నిసాని సౌజన్య, కోశాధికారిగా సంఘం లచ్చవ్వ, సహాయ కార్యదర్శిగా, సభ్యులుగా సరవ్వ, లక్ష్మీ, కొమరవ్వ, రామవ్వ, రజిత, రాజేశ్వరీ, లతా, రాజవ్వ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# సీఈఐజి పోస్టుకు జోరుగా పైరవీలు!

-కుర్చీ కోసం పోటాపోటీగా ప్రయత్నాలు..
-అర్హతలు లేకున్నా..
ప్రభుత్వ పెద్దలచుట్టూ ప్రదక్షిణలు
-అడ్డదారిలో రావడం..అడ్డగోలుగా వసూళ్లు చేయడం
-విద్యుత్ తనిఖీ అధికారి కార్యాలయంలో ఇదే నిత్యకృత్యం






**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి కార్యాలయంలో మళ్లీ కుర్చీలాట మొదలైంది. ఈ బంగారు బాతులాంటి కుర్చీని చేజిక్కించుకునేందుకు తాజాగా మరికొంత మంది పైరవీకారులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇక్కడ సీఈఐజీగా పనిచేస్తున్న వ్యక్తి పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో ఆకుర్చీని ఆశిస్తున్న పలువురు ఆఫీసర్లు ప్రభుత్వంలోని పెద్దలు, సచివాలయ కేంద్రంగా పని చేస్తున్న ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. గతకొన్నేళ్లుగా సీనియార్టీ, ఇతర అర్హతలతో సంబంధం లేకుండా భారీగా ముడుపులు చెల్లించిన వారికే ఈ పీఠాన్ని కట్టబెడుతుండటంతో ఆశావహులు ఆ మేరకు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే ఓ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్ అడ్డదారుల్లో ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొందినట్లు తెలిసింది. ఈ విషయం మరో డిప్యూటీ డీఈకి తెలిసి కోర్టు ద్వారా ఈ చర్యను అడ్డుకున్నట్లు సమాచారం. ఇందుకు సదరు డిప్యూటీ ఎలక్ట్రిర్ ఇన్స్పెక్టర్ కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. భారీ బహుళ అంతస్తుల భవనాలు, సినిమా హాళ్లు, హోటళ్లు, పరిశ్రమల్లో విద్యుత్ ప్రమాదాల నియంత్రణ కోసం ప్రభుత్వం తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ విభాగాన్ని 1987లో ఏర్పాటు చేసింది. 15 మీటర్ల ఎత్తు ఉన్న భవనాలు సహా 70 కిలోవాట్స్ సామర్థ్యానికిమించి విద్యుత్తు డిమాండ్ ఉన్న ప్రతి కనెక్షన్స్‌కు వీరి అనుమతి తప్పని సరి చేసింది. ఈ నిబంధనే వీరికి కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి (సీఈఐజీ) తో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి-1,2,3 డివిజన్లు, మెదక్-1,2 డివిజన్లు, మహబూబ్‌నగర్, నిజామాబాద్ డివిజన్లకు ఒక్కో డిప్యూటీ డీఈ ఇంఛార్జ్‌గా పని చేస్తున్నారు. వీరితో పాటు హైదరాబాద్, నిజామాబాద్‌లకు ఇద్దరు ఈఐలు కూడా ఉన్నారు. లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి, పది మంది డీఈలు, ముగ్గురు ఏఈలున్నారు. 2018 నుంచి ప్రభుత్వం ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. సీఈఐజీ సహా ఇతర కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ సీఈఐజీ స్థాయి అధికారే వీటన్నింటికీ ఇంఛార్జ్ సీఈఐజీగా వ్యవహరిస్తున్నారు. ఒక్కరే నాలుగు కీలక పోస్టుల్లో కొనసాగుతున్నారు. బిల్డర్లు, పరిశ్రమల యజమానులు థర్డ్‌పార్టీతో విద్యుత్ పనులు చేయిస్తుంటారు. ఐఎస్ఐ సర్టిఫైడ్ విద్యుత్ పరికరాలకు బదులుగా, మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాసిరకం కేబుళ్లు, ఎంసీబీలు, బ్రేకర్స్, ఆర్సీసీబీలు, ఎర్తింగ్స్ రాడ్స్‌ను వాడుతున్నారు. భవిష్యత్తు అవసరాల మేరకు లైన్లు, కేబుళ్లు, ఎంసీబీలు వాడకపోవడంతో ఆతర్వాత కొద్ది రోజులకే షార్ట్‌సర్క్యూట్ తలెత్తి అగ్నిప్రమాదాలకు కారణమవుతున్నారు. వీటిని పూర్తిగా అరికట్టాల్సిన సీఈఐజీ నామ మాత్రపు తనిఖీలతో కాంట్రాక్టర్లు ఇచ్చింది పుచ్చుకుని, సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఫలితంగా రూ.కోట్ల ఆస్తినష్టంతో పాటు విలువైన ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోంది.

**కాసులిస్తేనే సరి..లేదంటే కిరికిరి..**
2020 నవంబర్ నుంచి 2025 ఏప్రిల్ 25 నాటికి టిఎస్ఐపాస్ ద్వారా 13,453 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 12,609 దరఖాస్తులను ఆమోదించారు. ఇక జనరేటర్ల ఏర్పాటు అనుమతి కోసం 1072 దరఖాస్తులు రాగా, వీటిలో 994 ఆమోదించారు. 93 సినిమా థియేటర్ల నుంచి దరఖాస్తులు రాగా, వీటిలో 83 ఆమోదించారు. దరఖాస్తు, సీఈఐజీ తనిఖీ, అయితే అనుమతి ధృవీకరణ పత్రం జారీ కోసం రూ.10 వేల లోపే ఫీజు నిర్ణయించింది. అంతేకాదు దరఖాస్తు చేసిన 14 రోజుల్లోనే తనిఖీలు పూర్తి చేసి, ఆమోదించడమో, తిరస్కరించడమో చేయాలి. కానీ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్లు మొదలు, సీఈఐజీ వరకు ఎవరి స్థాయిలో వారు ఫైళ్లను రోజుల తరబడి తొక్కిపెడుతున్నారు. బిల్డింగ్ విద్యుత్ లైన్స్ డ్రాయింగ్, టీఎస్‌బిపాస్ పోర్టల్‌లో అప్‌లోడ్ మొదలు, క్షేత్రస్థాయిలో తనిఖీలు, ఆమోదం వరకు ఇలా భవన నిర్మాణ సామర్థం, పరిశ్రమ సామర్థ్యాన్ని భట్టి.. ఒక్కో ఫైలుకు ఏడు నుంచి పది లక్షలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, సోలార్ పవర్ యూనిట్ల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. అంతేకాదు ఆ తర్వాత పీరియాడికల్ ఇన్స్‌పెక్షన్ పేరుతో ఏడాదికోసారి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇచ్చేందుకు నిరాకరించిన వారి ఫైళ్లపై రకరకాల కొర్రిలు పెట్టి తిప్పిపంపుతున్నారు. సీఈఐజీ మొదలు ఇక్కడ పని చేస్తున్న ప్రతి ఇన్స్‌పెక్టర్ దీన్ని ఓ బంగారు బాతులా భావిస్తున్నారు. అడ్డదారుల్లో పోస్టింగ్‌లు సంపాధించి, ఆ తర్వాత ప్రతి ఫైలుకు ఓ రేటు ఫిక్స్ చేసి, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు.

## సిసి కెమెరాల ఏర్పాటుతో సత్ఫలితాలు : కమిషనర్ సుధీర్‌బాబు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**
రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ఏర్పాటు వల్ల సత్ఫలితాలను సాధించడం జరిగిందని కమీషనర్ జి.సుధీర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్ నగర శివార్లలోని మహేశ్వరం జోన్ పరిధిలో రూ.68 లక్షల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన 855 సిసి కెమెరాల ప్రారంభోత్సవం బాలాపూర్ సమీపంలోని మల్లాపూర్‌లో యెల్మేటి అమరేందర్‌రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక జోన్ డిసిసి డి.సునీతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమీషనర్ పలువురు పోలీసు అధికారులతో కలిసి స్విచాన్ చేసి సిసి కెమెరాలను ప్రారంభించారు. జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 138 దేవాలయాల వద్ద 566 సిసి కెమెరాలు, ముఖ్యమైన రహదారులు, చౌరస్తాలలో 289 సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. అయితే కెమెరాల ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సమావేశంలో సుధీర్‌బాబు మాట్లాడుతూ నేరాల పరిశోధనలో సిసి కెమెరాల ప్రాధాన్యత ఎంతో ఉన్నదని తెలిపారు. సిసి కెమెరాలు ఏర్పాటై ఉన్న చోట్ల నేరాలు చేయాలనుకునేవారు వెనుకడుగు వేస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే సిసి కెమెరాల వల్ల కీలకమైన కేసుల్లో పురోగతి సాధించడం జరిగిందని కమీషనర్ వివరించారు. ఇందులో ఆదిభట్ల పరిధిలో ఎటిఎం చోరీ, మల్కాజిగిరి పరిధిలో హత్య కేసు, మీర్‌పేట్ పరిధిలోని రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి భార్య హత్య కేసుతో పాటు చాలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దాదాపు 31 కేసుల్లో సిసి


సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబు

కెమెరాల సాక్ష్యం చాలా ఉపయోగపడిందని ఆయన అన్నారు. దేశంలోనే తెలంగాణ పోలీసులు నేర విచారణలో టాప్‌గా నిలిస్తే అందులో రాచకొండ పోలీస్ కమీషనరేట్ సిసి కెమెరాల ఏర్పాటులో మొదటి స్థానంలో ఉందని ఆయన వెల్లడించారు. మూడున్నర నెలల్లో 57 కేసుల్లో మంచి ఫలితాలు సిసి కెమెరాల వల్ల వచ్చాయని ఆయన తెలిపారు. కమీషనరేట్ పరిధిలో సిసి కెమెరాల ఏర్పాటును నిరంతర ప్రక్రియగా చేస్తామని కమీషనర్ స్పష్టం చేశారు. త్వరలో మరో 350 సిసి కెమెరాలను వివిధ చోట్ల ఏర్పాటు చేయనున్నామనీ ఇందులో భాగంగా యాదగిరి గుట్ట వద్ద కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఏర్పాటు చేసిన సిసి కెమెరాల నిర్వహణ బాధ్యత తీసుకుంటామని సుధీర్ బాబు తెలిపారు. కెమెరాలను ఏర్పాటు చేయించిన పోలీసు అధికారులకు, సహకరించిన దాతలను కమీషనర్ అభినందించారు. అనంతరం కెమెరాల ఏర్పాటు దాతలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డిసిసి డి.సునీతారెడ్డి, అడిషనల్ డిసిసి బివి సత్యనారాయణ, ట్రాఫిక్ అడిషనల్ డిసిసి సి. కుషాల్ కర్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపల్ కమీషనర్లు వెంకట్‌రాం, వాణిరెడ్డి, మహేశ్వరం ఎసిపి పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, ఐటి సెల్ ఎసిపి జె.నరేందర్ గౌడ్, ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు, స్థానిక బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, వివిధ పిఎస్‌ల ఇన్స్‌పెక్టర్లతో పాటు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, తోట శ్రీధర్‌రెడ్డి, తుక్కుగూడ మాజీ వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, వివిధ ప్రాంతాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, దాతలు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు నోడల్ ఏజెన్సీ అవసరం

### -హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రమాదాల నివారణకు విద్యుత్, ఫైర్, ఇండస్ట్రీ ఇలా ఎవరికి వారు కాకుండా..ఇందుకు ఉద్దేశించిన వ్యవస్థలన్నీ ఒక ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చి పని చేయాల్సినవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఏ.విరంగనాథ్ అన్నారు ఎలక్ట్రికల్ సేఫ్టీ ఇన్ బిల్డింగ్స్ అనే అంశంపై శనివారం హైడ్రా కార్యలయంలో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యుత్ వినియోగంలో ఉన్న లోపాలవల్లే ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరుగుతున్న వేళ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు.. అందరిలో అవగాహన పెంచడం అవసరం ఉందన్నారు. భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారో లేదో పరిశీలించడానికి సంబంధిత విభాగాలకు చెందిన నిపుణుల బృందంతో ఒక నోడల్ ఏజెన్సీని రూపొందించాలని అభిప్రాయపడ్డారు. విద్యుత్ వైరింగ్, ఎర్తింగ్, నాణ్యమైన ఎలక్ట్రిక్ పరికరాలను వినియోగిస్తున్నారా లేదా అనేది తనిఖీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలే కాకుండా అపార్టుమెంట్లు, కార్యాలయాలు, నివాసాలలో కూడా భద్రతా ప్రమాణాలు పాటించేలా ఈ నోడల్ ఏజెన్సీ చూడాలన్నారు. దుర్ఘటన జరిగిన తర్వాత పోస్టుమార్టం చేసేలా కాకుండా.. అందుకు ఆస్కారం లేని విధంగా చర్యలు తీసుకోవాలని.. అందుకే ఈ సదస్సు పెట్టామన్నారు. హైడ్రాకు చెందిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు విభాగం ఈ సమన్వయాన్ని తీసుకు రావాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్, బాయిలర్స్ డిపార్టుమెంట్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ భీమారావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ పరిశ్రమలు, భారీ కట్టడాలు, నివాస సముదాయాల భద్రత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించారు. ఈకార్యక్రమంలో హైడ్రా ఫైర్ విభాగం అదనపుసంచాలకులు పాపయ్య, ఎస్పీ సుదర్శన్, డిప్యూటీ కలెక్టర్ సుధ, ఆర్ ఎఫ్‌వో జయప్రకాశ్, డీఎఫ్‌వోలు యజ్ఞనారాయణ, గౌతం, ఎస్ ఎఫ్‌వోలుపాల్గొన్నారు.



వివిధ విభాగాల ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్

## ప్రతి షాప్‌లో డస్ట్‌బిన్ వినియోగించాలా చూడాలి

### - డిప్యూటీ కమిషనర్ రవి కుమార్



**అత్తాపూర్ ఏప్రిల్26, ప్రభాతవార్త :**
జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఎఫ్ఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి షాప్‌లో రెండు డస్ట్‌బిన్ అందులో నల్ల కవర్ పెట్టించాలని వీటిని ఎస్ఎటి ఆటోలకి అనుసంధానం చేయాలని ఎస్ఎఫ్ఎలకు ఆదేశించారు. అదేవిధంగా రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి షాప్‌ని బట్టి రూ.1000 నుండి రూ.5000ల వరకు ఆన్‌లైన్ ద్వారా జరిమానా విధించాలని సూచించారు. రెండవ సారి కూడా ఇదే విధంగా చెత్త వేస్తే ఫైన్‌ని రెట్టింపు చేయాలని మరియు లైసెన్స్ రద్దు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి షాప్‌లో రెండు చెత్తబుట్టలు వినియోగించేలా ఎస్ఎఫ్ఎలు చొరవ చూపాలని సూచించారు. ప్రతి వార్డుకి ముగ్గురు మెంబర్స్‌తో రెండు టిమ్‌లని ఏర్పాటు చేయడం జరిగిందని అన్ని టిమ్‌లు వారికి కేటాయించిన వార్డులని సందర్శించి రోడ్లపై చెత్త వేస్తున్న టి బండ్లు, విధి వ్యాపారులు, వైన్‌షాపు, కమిర్షియల్ వ్యాపారస్తులని గుర్తించి ప్రతి రోజు 15 నుండి 20 షాప్‌లకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియను ఎఎంఒహెచ్ పర్యవేక్షిస్తారని ఆదేశించారు. పౌరులు, వ్యాపారస్తులు తమ పరిసరాలు, రహదారుల వెంబడి చెత్త వేయకుండా బాధ్యతయుతంగా ప్రవర్తించాలని జిహెచ్‌ఎంసి పారిశుధ్య నిర్వహణలో తమ వంతు సహకారం అందించాలని కోరారు.

## పాకిస్తానీలు సరే..అకమ్ర విదేశీయుల సంగతేంటి?

- వివరాలపై ఆరా తీస్తున్న నగర పోలీసులు
- వేలల్లో నైజీరియన్లు, బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు
- మాదకద్రవ్యాల విక్రయాల్లో వారే అధికం




**హైదరాబాద్, ఏప్రిల్26, ప్రభాతవార్త:**
పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తానీల పీడ విరగడకానుంది. మెడికల్ వీసాల మినహా ఆదివారంతో బిజినెస్, స్టూడెంట్ అన్ని రకాల వాటిపై గడువు ముగియనుంది. అయితే వారిని పంపించడంతో పాటు ఇక్కడే అక్రమతిష్ట వేసే వారి భరతంపట్టేందుకు వ్యూహాత్మాక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే శనివారం నల్గురి పాకిస్తానీలకు నోటీసులు అందజేయగా... ఇతర విదేశీయుల వివరాలను ఆరా తీస్తున్నారు. వేలల్లో నైజీరియన్లు, బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఆర్థిక సంక్షోభం, మత్తుపదార్థాల విక్రయాలకు వారే అధికశాతం ఆజ్యం పోస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల పట్టుబడిన వారిలో అధిక సంఖ్యలో నైజీరియన్లే ఉన్నారు.

**విజిట్ వీసాలే అధికం...**
పాకిస్తాన్‌తో పాటు బంగ్లాదేశీ, నైజేరియాన్, కజకిస్తాన్, సౌదీల్లాంటి ఇతర దేశాల వారు ఏటా భారత్‌కు వస్తున్నారు. సాధారణంగా విడిది కోసం వచ్చి వీసా ముగించిన అక్రమంగా ఉంటున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, గోవా, బెంగళూర్, ముంబాయి లాంటి మహనగరాల్లో రహస్యంగా తలదాచుకుంటున్నారు. వీరి రాకపోకలపై పోలీసులు దృష్టిసారించకపోవడంతో కొత్త నేరాలకు తెరలేపుతున్నారు. ఇక్కడ కార్యకలాపాలను పసిగట్టి స్నేహితులతో రాయబారం నడుపుతూ మోసాలకు తెగిస్తున్నారు. ముఖ్యంగా కొకైన్, కేఫ్‌లైన్‌లాంటి డగ్స్‌ను సరఫరా చేస్తూ తీవ్రమైన నేరాలకు ఉసిగల్పుతున్నారు. అయితే పోలీస్ యంత్రాగం వద్ద వీరి పూర్తిస్థాయి వివరాలు లేనట్లే తెలుస్తోంది. ఏదైన ఘటన జరిగితేనే వెల్లడయ్యే అవకాశం లేకుండా పోయింది.

**ప్రతీ కదలిక తెలియాల్సిందే...ఇకపై ఉక్కుపాదమే**
డ్రగ్స్‌లాంటి మత్తుపదార్థాలపై ప్రభుత్వం సీరియస్‌గానే ఉంది. ఎక్కడ ఏం చిన్నపాటిది దొరికిన ఆరాచకులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఎవరెవరు ఏం చేస్తున్నారనే విషయాలు కూడా రాబట్టాల్సిన అవసరం ఉంది. రోజువారి కలపాలపై ఆరా తీయాలి. పాస్‌పోర్టు, వీసాల గడువును తనిఖీ చేయాలి. నకిలీపత్రాలను పరిశీలించాలి. కార్డన్‌సర్చ్‌లతో ప్రాంతాలను జల్లెడపట్టడంతో ఎంతో మంది పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. అక్రమతిష్టవేసిన వారే పోలీసుల కళ్లగప్పి ప్రాంతాలు మారుతూ తప్పించుకుంటున్నట్లు తెలుస్తుంది. అధికంగా ఉంటున్న పాతబస్తీ, టోలిచౌకి, లంగర్ హౌజ్, గోల్కొండ ప్రాంతాల్లో వారి రాకపోకలను పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఏదీ ఏమైన చిన్న పాటి నేరం చేసినట్లు రుజువైతే శిక్ష మరింత కఠినంగా వేయనున్నారు. అయితే ఇప్పటికే సైబర్ క్రైం, మాదకద్రవ్యాల్లాంటి విక్రయాలపై రూ.కోట్లు సొమ్ముచేసుకుంటున్న వారిపై కొరడా ఝూ లిపిస్తున్నారు.

## నేత్రపర్వం సత్యకీర్తి కూచిపూడి నాట్యహేళ

**రవీంద్రభారతి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**
సత్యకీర్తి నిత్యధామం కూచిపూడి నృత్యకళాశాల వ్యవస్థాపకుడు, నాట్యగురు దొడ్డ బాలాజీకుమార్ నృత్యశిక్షణలో సుశిక్షితులుగా మలచబడిన యువనర్తకులు 108మంది తమ అందెలరవళిలతో కూచిపూడి నాట్యహేళ శీర్షికతో వివిధ అంశాలతో జరిపిన అద్భుత నృత్యవిన్యాసాలు ఆహుతులైన అశేష ప్రేక్షకులు, ఔత్సాహిక కళాభిమానులకు నేత్రపర్వం కావించి మంత్రముగ్ధులను చేశారు. సంస్థ నాల్గవ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురు బాలాజీకుమార్ నేతృత్వంలో కూచిపూడి నాట్యహేళ ముందుగా గణేష్ వందనంతో ప్రారంభమై జతిస్వరం, అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలు, శివాష్టకం, ఆనంద తాండవం, అష్టలక్ష్మిస్తోత్రం, మహిషాసురమర్ధిని వంటి అతిక్లిష్టమైన నృత్యాంశాలను అవలీలగా ప్రదర్శించి ప్రేక్షకులను సమ్మోహనపరిచి తన్మయుల్ని కావించారు. ప్రముఖంగా గురువు బాలాజీకుమార్ తన కుమార్తె కీర్తనతో కలిసి కన్నులపండువగా నర్తించడం విశేషం. ఈ కార్యక్రమానికి ప్రముఖ నాట్యగురువులు డా. వనజ ఉదయ్, లక్ష్మి తదితరులు ప్రత్యేక అతిథులుగా విచ్చేసి నాట్యహేళలో అద్భుత నృత్యపరిమళాలు వెదజల్లి మెప్పించిన కళాకారుల ప్రతిభను ప్రశంసించి శుభాశీస్సులు అందజేశారు. ఈ నృత్యకళాశాల నుండి ఐదువందలకుపైగా విద్యార్థులు శిక్షణ పూర్తిచేసుకోవడమే కాకుండా రెండువందలమంది నృత్యంలో సర్టిఫికెట్ డిప్లమా కోర్సులు పూర్తిచేయడంతోపాటు దేశవిదేశాల్లో ఐదువందలకుపైగా ప్రదర్శనలివ్వడమేకాక నాదనీరాజనంలో ప్రదర్శనలిచ్చి శుభాభినందనలు పొందారని అతిథులు కొనియాడారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయి విద్యను అభ్యసించాలి

### -మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి


ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి

**కేశంపేట ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**
ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయి విద్యను అభ్యసించాలని తాజా మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే ఇంగ్లీష్ రావడం ఎంతో అవసరమని ప్రతి విద్యార్థి ఇంగ్లీష్ పై అవగాహన పెంచుకోవాలి విద్యార్థులు వేసవికాలంలో తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా ఇంగ్లీష్ నేర్చుకోవాలన్న ఉద్దేశంతోనే తమ సొంత ఖర్చులతో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతి గదులను ఏర్పాటు చేశామన్నారు, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకునేందుకు వచ్చిన విద్యార్థులకు మినరల్ వాటర్, స్నాక్స్ ఉచితంగా అందివ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విష్ణన్నకు విద్యపై ఉన్న మక్కువతో ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు పలువురు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, మల్లేష్, స్పోకెన్ ఇంగ్లీష్ అధ్యాపకుడు శ్రీశైలం, మరియు గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన పంచాయతీరాజ్ అధికారులు



**యాచారం, ఏప్రిల్ 26, ప్రభావతవార్త :**
మాల్ గ్రామ పంచాయితీనీ ఉత్తమ గ్రామపంచాయతీగా అభివృద్ధికి కృషి చేసిన అధికారులకు గ్రామ ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అభినందనలు తెలిపారు. జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికైన అవార్డు పొంది అనంతరం శనివారం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డినీ డి పి ఓ సురేష్ మోహన్, డి ఎల్ పి ఓ సాధన, ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎంపీ ఓ శ్రీలత, గ్రామ కార్యదర్శి రాజు, మాజీ వైస్ ఎంపీపీ కొడవకంటి శ్రీనివాస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి ఆయన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిత్తశుద్ధితో పనిచేస్తే అభివృద్ధిలో ముందు ఉంటామని అందరు కలిసి కట్టుగా పని చేసిన వారందరికీ అభినందనలు తెలిపి మరింత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విధి నిర్వహణలో అధికారులు సమయంతో సమిష్టిగా కృషి చేస్తే అభివృద్ధి అనేది సాధించవచ్చు అన్నారు.

## యాచారంలో కొవ్వొత్తుల ర్యాలీ



**యాచారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఉగ్రదాడిని ఖండిస్తూ.. యువజన కాంగ్రెస్ యాచారం మండల అధ్యక్షుడు పాశం జయప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సాగర్ రహదారిపై గల అంబేద్కర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాశ్మీర్లోని అనంతనాగ్ జిల్లాలోని పహల్గామ్ పర్యాటకులపై చేసిన ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి తద్వారా అమరవీరులకు నివాళులు అర్పించారు, ర్యాలీలో యాచారం మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మస్కు నర్సింహా, రంగారెడ్డి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి పొలమోని రామకృష్ణ యాదవ్, నర్రే శ్రీశైలం, ముచర్ల యాదగిరి, మల్లేపల్లి ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ ప్రసిడెంట్ ప్రశాంత్, మధు, సాయికిరణ్, లడ్డు, శివ గౌడ్ అన్ని గ్రామాల యూత్ ప్రసిడెంట్లు యువత, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ, యూత్ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరంగల్ సభను విజయవంతం చేయండి

### -కణం ప్రేమ్ కుమార్ గౌడ్

**కేశంపేట ఏప్రిల్ 26 ప్రభాతవార్త** వరంగల్ లో నేడు జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు మండల పరిధిలోని ప్రజలు కార్యకర్తలు నాయకులు మాజీ ఎంపీటీసీలు జడ్పిటిసిలు సర్పంచులు అధిక సంఖ్యలో తరలివచ్చి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ కేశంపేట మండల వైస్ ప్రెసిడెంట్ కణం ప్రేమ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## నాచారం స్క్రాప్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

**నాచారం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**
నాచారం ఇంపీఎస్ పరిధిలో శనివారం రాత్రి భారీ అగ్ని ప్రమా దం సంభవించింది. స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం కారణంగా విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. అగ్నిప్రమాదంగా కార ణంగా భారీగా ఎగిసి పడిన మంటలు. దీంతో విషయం తెలుసుకున్న అగ్నిప్ర మాద సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చా రు. అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటల నుంచి మంటల ఆర్పారు. గోదాంలో ప్లాస్టిక్ వస్తువులు అంటుకోవడంతో దట్టమైన పొగలు అలుముకు న్నాయి గోదాంకి ఎటువంటి పేరు లేదు. కనీసం నేమ్ ప్లేట్ కూడా లేదు. ఇదే గోదాంలో గతంలో కూడా ఒకసారి ఫైర్ ఆక్సిడెంట్ అయినట్టు స్థానికులు తెలిపారు.

## వైభవంగా శని త్రయోదశి మహోత్సవం


శనైశ్చరునికి తైలాభిషేకం చేస్తున్న దృశ్యం

**వర్గల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో శనివారం శనిత్రయోదశి మహోత్సవాన్ని వైభవంగానిర్వహించారు. ఆలయవ్యవస్థాపకచైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేదపండితులు శ్రీశనైశ్చరుడికి తైలాభిషేకం చేసి మహోత్సవానికి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా కుంభం, మీనం, మేషం, ధనుస్సు, సింహ రాశుల వారు క్షేత్రానికి పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి తైలాభిషేకం చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

## బోరు మోటారును ప్రారంభించిన నగేష్‌శెట్కార్


నగేష్ శెట్కార్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

**మనూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మనూర్‌లో ఏర్పాటుచేసిన బోరు మోటారును ఉమ్మడిమెదక్ జిల్లా ప్రణాళికాసంఘం మాజీ సభ్యులు నగేష్‌కుమార్‌శెట్కార్ ప్రారంభించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నగేష్‌కుమార్ శెట్కార్ గ్రామస్థులతో కలిసి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి హనుమాన్ ఆలయం, చర్చిల వద్ద ఏర్పాటుచేసిన బోరు మోటార్లను నగేష్ శెట్కార్ ప్రారంభించారు. బోరుమోటార్లను ప్రారంభించిన నగేష్‌కుమార్ శెట్కార్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవాచారి జోషి, మాజీ సర్పంచ్‌లు సాయిలు, అంజయ్య, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గంపల సిద్దారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యుల ఫోరం అధ్యక్షులు, నాయకులు రవీందర్, చీకుర్తి సతీష్, శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి, మానమోల చిన్న, హనుమగొండ, సంగారెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

## నూతన టాయిలెట్ సముదాయం ప్రారంభం..

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్ ప్రాంగణంలో విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన అత్యాధునిక టాయిలెట్ భవన సముదాయాన్ని ఎన్వి లక్ష్మీ ్మ ఫౌండేషన్ డైరెక్టర్ మోహన్ నిష్టాల, టెక్ సిస్టమ్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రతినిధులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.హుస్సేన్ మాట్లాడుతూ, ఈసముదాయాన్ని ఎన్వి లక్ష్మి ్మ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ద్వారా టెక్ సిస్టమ్స్ గ్లోబల్ సర్వీసెస్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకంలో భాగంగా సుమారు 12 లక్షల రూపాయలవ్యయంతో నిర్మించారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.హుస్సేన్, విద్యార్థినులకు నాణ్యమైన విద్యతోపాటు, నాణ్యమైన మౌలిక సదుపాయాలను అందించేందుకు నిరంతరము శ్రమిస్తున్నారని తెలియ జేస్తూ వారికి కళాశాలవిద్యార్థినిలు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈకార్యక్రమంలో టెక్ సిస్టమ్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రతినిధులు నందకుమార్, మోహన్ ముమ్మాడి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

**-మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య**

**అల్లాదుర్గం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
వరంగల్‌లోని ఎల్కతుర్తితో బిఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బాలయ్య పిలుపునిచ్చారు. శనివారం బాలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ది శూన్యమని ఆరోపించారు. రజతోత్సవ సభలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై చర్చిస్తారన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజాదరణను త్వరలోనే కోల్పోయిం దని పేర్కొన్నారు. రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకుని సభను విజయవంతం చేయాలని బాలయ్య సూచించారు.

## యువనాయకులను అభినందించిన మాజీమంత్రి


యువకులను అభినందిస్తున్న మాజీ మంత్రి

**బెజ్జంకి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండలంలో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సిద్దిపేట నుండి పాదయాత్రగా బయలుదేరిన మండల యువ నాయకులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శని వారం అభినందించారు. ఈసందర్భంగా పాదయాత్రలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు చోటుచేసుకోకుండా యువనాయకులు చూసుకో వాలని, ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న సందర్భంగా వారి ఆరోగ్యంపట్ల సైతం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్‌గుప్త, లక్ష్మన్, రాజు, రావుల రాజు, తిరుపతి, సుదర్శన్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## రజతోత్సవ సభకు తరలివెళదాం

**-మండల బిఆర్ఎస్ అధ్యక్షులు నర్సింలు**

**అల్లాదుర్గం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ఈనెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తితో నిర్వహిస్తున్న బిఆర్ఎస్ రజతో త్సవ సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి బిఆర్ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు పి. నర్సింలు కోరారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అప్రజాస్వామిక పాలనపై సభలో మాజీముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రసంగించను న్నారని, అందుకు పార్టీశ్రేణులు సభకు పెద్దసంఖ్యలో తరలాల్సిన అవ సరం ఉందని నర్సింలు సూచించారు.

## ఎస్టీయు మండలశాఖ నూతన అధ్యక్షుడిగా సతీష్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండల శాఖ అధ్యక్షునిగా సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్టీ జిల్లా ప్రధాన కార్య దర్శి కర్రె పోచయ్య శనివారం తెలిపారు. ఆయన చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ మండల పరిధి యుపిఎస్ పాఠశాల జంగరాయిలో ఎస్‌జిటి గా విధులు నిర్వహిస్తున్న సతీష్ ఎస్టీయు మండలశాఖ అధ్యక్షులుగా ఎన్ని కైనట్లు తెలిపారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన సతీష్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

# 40 ఫీట్ల రోడ్డు ఒప్పుకోమంటున్న బాధితులు

**-రామాయంపేట అభివృద్ధికి అందరం సహకరిద్దాం..**
**-మెయిన్ రోడ్డు వెడల్పు విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం..**
**-ప్రజల భిన్నాభిప్రాయాలతో సమావేశం రసాభాస..**

**రామాయంపేటమున్సి పాలిటీ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
గతపదేళ్ల కాలంలో రామాయంపేట పట్టణం అభివృద్ధిలో ఎంతో వెనకబడిందని, ప్రస్తుతం అభి వృద్ధి కోసం నిధులు వస్తున్నా....కొందరు వ్యక్తులు అడ్డుపడేందుకు ప్రయత్నిస్తున్నారని, రామాయం పేట పట్టణంలో అందరం కలిసి అభివృద్ధి చేసుకు నేందుకు ప్రజాభిప్రాయసేకరణ సమావేశం ఏర్పాటు చేసినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు అన్నారు. రామాయంపేట పట్టణంలోకి వెళ్లేందుకుగాను ఉన్న మెయిన్‌రోడ్డు (మెదక్ క్రాస్ రోడ్డు నుండి ఎస్సీ కాలనీ) వరకు మంజూరైన రోడ్డు40ఫీట్ల వెడల్పుతో పనులు చేపట్టేందుకు గాను గత కొన్ని రోజులుగా ప్రజలనుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతు న్నాయి. 40ఫీట్ల వెడల్పుతో రోడ్డువేయడం మాను కోవాలని రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోతున్న బాధితులు, కొందరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని మహంకాళి దేవ స్థానంలో సుమారు అన్నికులసంఘాల నాయకులు, వివిధరాజకీయపార్టీ నాయకులు, వాణిజ్య,వ్యాపార వర్గాలతోపాటు ప్రజలతో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు వ్యాపారులు, ఇండ్లను కోల్పో తున్న బాధితులు పాల్గొన్నారు. 40ఫీట్ల రోడ్డు కాకుండా అందరిని దృష్టిలో పెట్టుకొని వెడల్పు చేయాలని అన్నారు. తాము అభివృద్ధికి అడ్డుపడ మని కానీ విచ్చలవిడిగా రోడ్డు వెడల్పుచేస్తే చాలా మందిమి నష్టపోతామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంలో తాము ఎట్టి పరిస్థితుల్లో వెనక్కు తగ్గ మని స్పష్టంచేశారు. ఈవిషయంలో స్థానికఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కల్పించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేవలంకొంతమంది తమ స్వార్థంకోసం 40 ఫీట్ల రోడ్డు చేయాలని పట్టుపట్టడం సమంజసం కాదన్నారు. కాగా పూర్తిస్థాయిలో ఇండ్లు కోల్పో తున్న బాధితులకు డబుల్‌బెడ్‌రూమ్‌లు ఇచ్చే విధంగా స్థానికఎమ్మెల్యేతో మాట్లాడి ఏర్పాటుచేస్తా మని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అయితే 40 ఫీట్లు కాకుండా కనీసం 33 నుండి 36 ఫీట్ల వరకు వెడల్పుతో రోడ్డునిర్మిస్తే చాలావరకు ఇండ్లు కోల్పో కుండా ఉంటుందని, ఆదిశంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశా రు. కాగా కొంతమంది లేనిపోనికారణాలు చెప్పి 40 ఫీట్ల రోడ్డు కోసం పట్టుపట్టడం జరుగుతుందని ఇది ఎమ్మెల్యేకు చెడ్డపేరు వచ్చేవిధంగా కొందరు వ్యవ హరిస్తున్నారని పట్టణానికిచెందిన వ్యాపారి ఎనిశెట్టి సంతోష్ అనడంతో ఒక్కసారిగా సమావేశం రసా భాసాగా మారిపోయింది. ఈక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులకు, కొంతమంది బాధితులకు వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడున్న పెద్దలు సముదా యించి, అందరి ఏకాభిప్రాయంతోనే రోడ్డు పనులు చేపట్టాలని, కానీ అభివృద్ధిని మాత్రం అడ్డుకోవద్దని నిర్ణయించారు. మరొక్కసారి ఇండ్లు కోల్పోతున్న బాధితులతో సమావేశం ఏర్పాటుచేసి, రోడ్డుపనులు చేపడుతామని నాయకులు తెలిపారు.


రోడ్డు వెడల్పు విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం దృశ్యం

## మే 2న కలెక్టర్ కార్యాలయం ముందు 24 గంటల మహా ధర్నా


ప్లకార్డులు పట్టుకున్న వికలాంగులు

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ప్రతి వికలాంగునికి అంతోద్యయా రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు, యుడిఐడి కార్డు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ మే 2న కలెక్టర్ కార్యాలయం ముందు 24 గంటల మహా ధర్నా జయప్రదం చేయండి అని మహిళా విభాగం కన్వీనర్ కవిత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లాలో ఉన్న వికలాంగులకు అంత్యోదయ రేషన్ కార్డు స్థలమున్నవారికి ఇందిరమ్మ ఇల్లుకేటాయించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్‌జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మే 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు 24గంటల వికలాంగుల మహాధర్నా నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు. 2010 నుండి పెన్షన్ పొందుతున్న ప్రతి వికలాంగునికి యుడిఐడి కార్డు పంపిణీచేయాలి స్వయం ఉపాధికోసం దర ఖాస్తు చేసిన ప్రతి వారికి వెంటనే ఎలాంటి షరతు లేకుండా రుణాలు ఇవ్వాలి ఉపాధి హామీ పథకంలో వికలాంగులతో ప్రత్యేకంగా శ్రమశక్తి సంఘటలను ఏర్పాటుచేసి ప్రతి ఒక్కరికి జాబు కార్డు జారీ చేసి 150 రోజులు పని కల్పించాలి. జిల్లాలో వికలాంగులపై దాడులు చేసి బెదిరిస్తున్న వారిపై 2016 ఆర్పిడి చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలి కేసు నమోదు చేయడంలో నిర్లక్ష ్యం వహిస్తున్న పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి, గుర్తించిన పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలని అన్నారు. పై డిమాండ్ల పరిష్కారం కోసం మే 2న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాలో ప్రతి వికలాంగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో విశిలిది జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి, నాయకులు రాణి, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధం వస్తే మైనార్టీలం ముందుంటాం

**-మండల మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఖలీల్**

**అల్లాదుర్గం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేసి ప్రాణాలను బలిగొన్న వారిని కఠినంగా శిక్షించాలని అందోల్ మండల మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎండి ఖలీల్ అన్నారు. శనివారం ఖలీల్ మాట్లాడుతూ భారతదేశ సైనికులను ఎదుర్కొనే దమ్ము, ధైర్యంలేని ఉగ్రవాదులు అమాయకుల ప్రాణా లను బలికొన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కులమతాలు వేరైనా తామందరం భారతీయులమని, దేశంకోసం పోరాడాల్సివస్తే మైనార్టీలం ముందుంటాం అన్నారు. భారతదేశాన్ని కించపరిచేలా వ్యవహరించినా, మాట్లాడినా ఎంతటి వారైనా దేశద్రోహులుగానే గుర్తించి కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంద న్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిన అవసరం ఉందని, పాకిస్తాన్‌కు తగురీతిలో గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

## రెండురోజులు సదరెం రినివల్ శిబిరం

**మనూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ఈ నెల 28, 30 తారీఖులలో జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జనరల్ ఆసుపత్రిలో యూడిఐడి (సదరెం) రినివల్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి హైమద్ హుస్సేన్ తెలిపారు. యూడిఐటి పోర్టల్‌లో పునరుద్ధరణ కొరకు నిరంతరం రిజిష్టర్ చేసుకునే అవకాశం ఉందన్నారు. యూడిఐడి పోర్టల్ ద్వార రిజిష్టర్ చేసుకుని ఫోన్ ద్వారా లేదా మెసేజ్ ద్వారా అయినా సందేశం అందిన వారు మాత్రమే శిబిరంకు చేరుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**-జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి**


మహిళా రైతులకు రోటోవేటర్లు అందజేస్తున్న తూంకుంట నర్సారెడ్డి, వంటేరు నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ ఏడిఏ బాబునాయక్‌తో కలిసి మండలపరిధిలోని 9మంది మహిళారైతులకు రోటో వేటర్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ డివిజన్ పరిధిలో 14 రోటోవేటర్లు మంజూరు కాగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50శాతం సబ్సిడీ అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళా రైతులను ప్రోత్సహించే క్రమంలో ప్రత్యేకదృష్టి సారించి ఈపథకాన్ని వర్తింప జేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉత్పాదకతను పెంచడానికి వ్యవసాయ యంత్రాల ప్రాముఖ్యత ఎంతో ఉంటుండగా, ఈ అవకాశాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ కూలీల కొరతను అధిగమించడం, అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండగా రబీ సీజన్ దృష్టిలో పెట్టుకొని అవసరమైన ప్రతిచోట వరి ధాన్యం కేంద్రాలను ఏర్పాటుచేసి మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఏట నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్కారం యాదగిరి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సుఖేందర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, రేగొండగౌడ్, జంగం రమేష్‌గౌడ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, బెజుగామ శివారెడ్డి, నేత నాగరాజు, ఎక్బాల్, శ్రీగిరిపల్లి కుమార్, దప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం, మతోన్మాదాలను ఉక్కుపాదంతో అణిచివేయాలి

**-టిఎస్‌యుటిఎఫ్**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
మతోన్మాదాన్ని ప్రేరేపించే సంస్థలని వ్యక్తులని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం టిఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ఉగ్ర భూతాన్ని తగలబెట్టి నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.జంగయ్య, రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచి వేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఈకార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే.అశోక్, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, ఉపాధ్యక్షులు జే. కాశీనాథ్, ఎం.సువర్ణ, కోశాధికారి పి.శ్రీనివాసరావు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు జీ.విశాలి, ఎం.విజయకుమార్, జిల్లా కార్యదర్శిలు బి.అరుణశ్రీ, బీ.సాయితేజ, ఎం.నరేష్, ఏ.జగన్మోహన్ ఎండి. సంయోద్దీన్, ఆర్.సింహా చలం, చందర్ రాథోడ్, పి.ప్రసన్న, హరిసింగ్ నాయకులు వై.సైమన్, ధనరాజ్, శ్రీరామ్‌నాయక్, శివకుమార్, కౌసల్యదేవి, స్వప్న, జ్యోతిలింగం, రాములు, అంజయ్య, విజయలక్ష్మి, నాగమణి, ముకుంద, మాణిక్యం, పి. కిషన్, అబ్దుల్లా, వినోద్‌కుమార్, ఎం.సుచరిత తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

**హత్నూర, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
హత్నూర మండలానికి చెందిన యువనాయకులు మహమ్మద్ ఆసిఫ్, మహమ్మద్ గౌస్‌లు శనివారం మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని, హైదరాబాదులోని ఆయన స్వగృహంలో కలుసుకొని పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను తెలుసుకున్నారు. మండలంలోని పేదలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.

## ఆర్థిక సహాయం అందించిన చిన్నారులు

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బత్తిని రాముకు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్ కుమారుడు సాయిశ్రేయాస్, కూతురు శ్రీనితలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈసందర్భంగా ఎన్‌సి.సంతోష్ మాట్లాడుతూ గతంలో గజ్వేల్‌లోని గడాకార్యాలయంలో ఆఫీస్‌బాయ్‌గా 10సంవత్సరాలు పనిచేసిన బత్తిని రాము ప్రస్తుతం గడాకార్యాలయం లేకపోవడంతో ఉద్యోగం కోల్పోయి నిస్సహాయ స్థితిలో కుటుంబపోషణ భారంగా మారడం, అతని మామ ఆసుపత్రిలో చికిత్సపొందుతుండగా తనవద్దకు వచ్చి సమస్యను తెలుపు తుండగా తన కుమారుడు, కూతురు విని వారు దాచుకున్న రూ.2,190 రూపాయలను రాముకు అందజేసినట్లు తెలిపారు. మానవతావాదులు స్పందించి రాముకు అండగానిలవాలని, త్వరలో ఎఫ్ఎఫ్‌యు మిత్రబృందం ద్వారా సహాయం అందిస్తానని తెలిపారు. రాముకు ఉన్న గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగం కల్పిస్తే తన జీవితం సాఫీగా సాగుతుందని అన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం

**-తూంకుంట నర్సారెడ్డి**

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):**
ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం అని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన భూషన్నగారి రామకృష్ణగౌడ్‌కు సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ సిఎం సహాయనిధిని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి.షరీఫ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, ఈదుగాని శివులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

**-రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సింగం శ్రీనివాసరావు..**

**రామాయంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంతాల్లో తమ సంస్థ దాతల సహాయ, సహకారాలతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగం శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మెదక్ మండలంలోని రాయిన్ పల్లి గ్రామంలో తుప్రాన్ వివిఎస్‌టి ఇండస్ట్రీస్ సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామీణప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ముందుండి నడిపించాలని కోరారు. తూప్రాన్ లోని వి ఎస్ టి ఇండస్ట్రీస్ సహకారంతో ఇంతవరకు కొండాపూర్ ,ముప్పిరెడ్డిపల్లి ,కాళ్లకల్, దొంతి, నిజాంపేట గ్రామాల్లో మెగా వైద్య ఆరోగ్య శిబిర్యాల నిర్వహించినట్లు తెలిపారు.అందులో భాగంగానే రాయినపల్లిగ్రామంలో క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గి.సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, మెగా వైద్య క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన శిబిరాలకు మంచి స్పందన లభించినట్లు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య మెగా క్యాంపుకు అక్కడి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. మల్లారెడ్డి ఆసుపత్రికి చెందిన డాక్టర్లు, డెంటల్ డాక్టర్లు శిబిరములో పాల్గొని పేషెంట్లకు వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి డిజి శ్రీనివాసశర్మ, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి, మద్దెల సత్యం, దామోదర్‌రావు, రేషన్‌డీలర్ తోట శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర స్థలాలలో సిసి కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలి

**-జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్**

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా వివిధ కులమతాలకు చెందిన పవిత్ర స్థలాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని శనివారం జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని గుడులు, మసీదులు, చర్చిలు, ఇతర కులసంఘాల వద్ద అత్యాధునిక హై రెజల్యూషన్ సిసి కెమెరాలు, కనీసం నెలరోజుల రికార్డింగ్ సామర్థ్యంతో కూడిన డీవీఆర్‌లు అత్యవసరంగా ఏర్పాటుచేయాల్సి ఉందని, ఇది ఆయా మత సంఘాల కమిటీ ఇన్‌చార్జ్‌ల బాధ్యత అని అన్నారు. సిసి కెమెరాలు నేరాలను నివారించడంలోనే కాదు, జరిగిన నేరాలను ఛేదించడంలో కూడా ఎంతో ఉపయోగపడతాయని ఎస్పీ తెలిపారు. ఒకరి మతసంప్రదాయాలను మరొకరు గౌరవించినప్పుడే మత సామరస్యం నెలకొంటుందని, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులకు సహకరించవలసిందిగా సూచించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ప్రజలను రెచ్చగొట్టేవిధంగా తప్పుడు ప్రచారాలు చేస్తూ.., ప్రజాశాంతికి భంగం కలిగిస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని, అట్టి వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తే సంఘటనలు ఎదురైనప్పుడు ఎంటనే సమీప పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలే గాని ఎవ్వరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని టెంరిస్ అల్గోల్, బూచినెల్లి, హోతి(కె)లోని తెలంగాణ రాష్ట్ర గురుకుల కళాశాలలో విద్యను అందుకుని పరీక్షలు రాసి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు మోహియోద్దీన్, మండల అధ్యక్షులు తట్టు నారాయణ, నాయకులు తులసీదాస్ గుప్త, మాజీ ఎంపిపి విజయకుమార్, అలీ, జాఫర్ అలీ, మొహమ్మద్ జుబేర్, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో క్యాండిల్ ర్యాలీ

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు సంగారెడ్డిలోని అతిథి గృహం వద్ద అమరుల స్తూపం వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని అంతమొందించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఉగ్రదాడికి పాల్పడిన వారిని, ఉగ్రదాడికి వెనుకాల ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.నారాయణ, ఎ.నర్సింగ్‌రావు, ఆర్ శ్రీనివాస్, మహమ్మద్ నిజామొద్దిన్, రషీద్, ఎన్ వినీల రెడ్డి, టి.శ్రీనివాస్, మహమ్మద్ ఆదిల్, జిజశ్రీకాంత్, సామాజిక కార్యకర్తలు యం శ్రీధర్, ప్రవీణ్, రాజమల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక మేడేను జయప్రదం చేయండి

**-సిపిఐ సార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్**

**కొమురవెల్లి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ పిలుపునిచ్చారు.శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 1886లో అమేరికాలోని చికాగో నగరంలో కార్మికులకు 18 గంటల పని దినానికి వ్యతిరేకంగా 8 గంటలుపని విధానం కావాలని కార్మికులు యాజమాన్యం పోలీసులతో జరిపిన దాడుల్లో అమరులైన వారి రక్తం ద్వార కార్మికులు తమ హక్కును సాధించుకున్నారన్నారు.అయితే కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి కార్మికవర్గం హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. కేంద్రం తీరును మార్చు కోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, మండల కార్యదర్శి బాల్‌మోహన్, అంజయ్య, కనుకయ్య, ఎల్లయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## లారీ రెండు బైకులు ఢీ ముగ్గురు మృతి

**-ఇద్దరు చిన్నారులు ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి**

**నర్సాపూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
లారీ రెండు బైకులు ఢీకొనగా ఇద్దరు చిన్నారులు, ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మెదక్‌జిల్లా నర్సాపూర్ మెదక్ జాతీయ రోడ్డు చిన్నచింతకుంట స్టేజీ వద్దగల టర్నింగ్ వద్ద శనివారం రాత్రి 7.45 గంటల సమయంలో చోటు చేసుకుంది ఈమేరకు ఈసంఘటన వివరాలు ఎస్ఐ బి.లింగం కథనం ప్రకారం ఇలా వున్నాయి....నర్సాపూర్ నియోజకవర్గంలోని కౌడిపల్లిమండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన మాల గోపాల్ (32) భార్య పూజ, కుమారుడు అనుదీప్ (5), కూతురు ఆధ్యశ్రీ, గోపి వదినకూతురు సహస్ర (8) కలిసి మోటార్‌సైకిల్‌పై నర్సాపూర్ పట్టణానికి షాపింగ్ కోసం వెళ్తున్నట్లు తెలిపారు ఈక్రమంలో ఎదురుగా కంచన్‌పల్లికి చెందిన దుంపల కరుణాకర్ అతని భార్య వరలక్ష్మి 8నెలలగర్భవతి. రెండుబైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈప్రమాదంలో రోడ్డుపై కిందపడిన గోపాల్ బైక్‌పై నుండి వెనక వచ్చిన లారీ దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో వెంకట్రావుపేట్ గ్రామానికి చెందిన గోపాల్, కుమారుడు అనుదీప్, వదిన కూతురు సహస్రలు అక్కడికక్కడే మృతిచెందగా గోపాల్ భార్య పూజ, ఆధ్యశ్రీలు తీవ్ర గాయాల పాలై ప్రాణాలతో బయటపడ్డారు. మరో బైక్‌పై వెళ్తున్న కరుణాకర్, అతని భార్య వరలక్ష్మిలకు స్వల్పగాయాలు కాగా నర్సాపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. ఈమేరకు ఎస్ఐ లింగం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకొని పంచనామా నిర్వహించి మృతిచెందిన శవాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుననట్లు ఎస్ఐ లింగం తెలిపారు. ఈరోడ్డు ప్రమాదంలో ఒకవ్యక్తి ఇద్దరు చిన్నారులు క్షణంపాటులోనే ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందడం పట్ల పలువురు కంటతడి పెట్టుకున్నారు.


**IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE, SANGAREDDY DISTRICT AT SANGAREDDY**
**G.W.O.P.NO. 10 OF 2025**
**Between:**
Master Lachireddy Summera, Rep. by his father and natural Guardian Sri. Lachireddy Poornachand ... **Petitioners**
**AND**
All concerned ... **Respondents**
**NOTICE**
To,
All Concerned
Please take notice that the petitioners filed the above case appointment of the petitioner No.2 as a guardian of the minor petitioner No. 1 and his property i.e. petition schedule property and to permit him to sell the said property to third parties on behalf of petitioner No.1, on which the Hon'ble court was pleased to order to issue notice to you (all concerned) and the same is posted on 01-05-2025 at 10-30 a.m. for appearance of the respondents or any body have any objections may appear before the Hon'ble court in person or through counsel on the said date and time, failing which the matter will be decided on merits.
**(By order of the court )**
**Sd/- M. Narsimlu**
Advocate
H.No. 12-193/A, Srinagar Colony, Patancheru Town and Mandal, Sangareddy District.
**Mobile No. 9440477482**

## ఆంజనేయ ఆలయంలో ముగిసిన పారాయణం



గాథ పారాయణంచేస్తున్న వ్యాసపీఠం అవధూత్ మహారాజ్

**సిర్గాపూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
మండలంలోని చాప్ల(కె) ఉజలంపాడ్ గ్రామ శివారులోని సీమ ఆంజనేయస్వామి ఆలయంలో గత వారంరోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్త మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వ్యాసపీఠం అవధూత్ మహారాజ్‌చే నిర్వహిస్తున్న గాథ పారాయణ మహోత్సవ కార్యక్రమం శనివారంతో ఘనంగా ముగిసింది. ఆలయానికి చేరుకున్న భక్తులకు వంగ్దాల్ గ్రామానికి చెందిన అమీరాబాద్ ఇందుమతి బాలాజీరావు పాటిల్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 27న కరణ్ గజేంద్రభారతిమహారాజ్‌చే ఉదయం 10గంటలకు కాలాకీర్తనసేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధార్మిక ఆధ్యాత్మిక సేవాసదన్ ట్రస్ట్ బాధ్యులు సంజీవులు పేర్కొన్నారు. కార్యక్రమానికి గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రమంత్రుల పర్యటనను విజయవంతం చేయండి
**-హత్నూర తహసీల్దార్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హత్నూర తహసీల్దార్

**హత్నూర, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
హత్నూర మండలంలో ఈనెల 28న జరిగే ఇద్దరు మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని హత్నూర తహసీల్దార్ పర్విన్ షేక్ కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ హత్నూరలోని అంబేద్కర్ కళాశాలలో అభివృద్ధి పనులకు జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహలు, ప్రారంభోత్సవాలు చేస్తారని, నూతన తహసీల్దార్ భవనానికి శంకుస్థాపన చేస్తారని, అనంతరం దౌల్తాబాద్ సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే భూభారతి అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె అన్నారు. మంత్రులతోపాటు స్థానికఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి, ఎంపి రఘునందన్‌రావు, ముగ్గురు ఎమ్మెల్సీలు హాజరవుతారని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై భూభారతి అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ పర్విన్ షేక్ కోరారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ దావూద్ పాల్గొన్నారు.

## తడిసిన ప్రతి ధాన్యపుగింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
**-నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి హరికృష్ణ**



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడాల్సిన అవసరంలేదని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాలలో అకాలవర్షంతో తడిసిన వరిధాన్యాన్ని ఆయన శనివారం అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్‌సర్కారు ధ్యేయమన్నారు. లారీల కొరతలేకుండా తగుచర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలుకేంద్రాలకు తీసుకవచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలుచేసిన రైతులకు మద్దతుధర అందేలా కృషిచేయడం జరుగుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి మద్దతుధరనుపొందాలన్నారు. ఆయనవెంట డిప్యూటీ తహసీల్దార్ రాజేశం, ఎవో నరేష్, పార్టీనాయకులు ముద్దం లక్ష్మి, పూజల గోపికృష్ణ, కలీం, అంజిరెడ్డి, మల్లారెడ్డి, మంద పాండు, సదాశివరెడ్డి, దేవయ్య ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య
**-డిఈవో శ్రీనివాస్‌రెడ్డి**




బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న డిఈవో శ్రీనివాస్‌రెడ్డి

**చేర్యాల, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ప్రభుత్వపాఠశాలల్లోనే నాణ్యమైనవిద్య అందుతుందని డిఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా కడవేర్గు, శభాష్‌గూడెం, నాగపురి, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఈవోతోపాటు మండల ఉపాధ్యాయులు ప్రయివేటుపాఠశాలలకు ధీటుగా ప్రభుత్వపాఠశాలలు నడుస్తున్నాయని ప్రయివేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఇంటింటికి తిరిగి వివరించారు. ప్రభుత్వపాఠశాలల్లో అన్నిసౌకర్యాలతోపాటు నూతన టెక్నాలజీతో బోధన కల్పిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఉచితంగా పాఠశాలల్లో స్కూల్ యూనిఫామ్స్, మధ్యాహ్నభోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రచ్చ కిష్టయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, తిరుమల కాంతికృష్ణ, ఎలికట్టె అయిలయ్య, మరాఠి సంతోష్, మల్లికార్జున్‌రెడ్డి, కిషన్, రాజు, బాలభాస్కర్, రామచంద్రమూర్తి, విజయ్ తదితరులు ఉన్నారు.

## మిరిదొడ్డిలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్

**మిరిదొడ్డి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
మండలంలోని చెప్యాల ప్రాథమిక పాఠశాలలో శనివారం మూడవ రోజు ఉత్సాహంగా ఉల్లాసంగా సమ్మర్ క్యాంప్ కొనసాగింది. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడానికి పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తరగతుల వారీగా ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిష్టారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు పెద్దపీట వేయాలి

**-గంజాయి, మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపండి**
**-పెండింగ్ కేసుల సమీక్షాసమావేశంలో పోలీస్ కమిషనర్ అనురాధారెడ్డి**



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**
సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల రక్షణకు పెద్ద పీట వేయాలని, కేసుల నమోదులో జాప్యంచేయవద్దని పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి అన్నారు. శనివారం కమిషనర్ కార్యాలయంలో సిద్దిపేట వన్ టౌన్, టూటౌన్, త్రీటౌన్ అధికారులతో పెండింగ్‌కేసులపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 2023, 2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన అండర్ ఇన్విస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల గురించి, సిఐలు, ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ సిసిటిఎస్‌ప్రకారం క్రైమ్ రివ్యూ సమావేశాలు జరుగుతున్నాయని కావున ప్రతి పోలీస్ స్టేషన్‌లో డేటాను ఇందులో పొందుపరచాలన్నారు. నూతన టెక్నాలజీని అధికారులు ఉపయోగించుకోవడం నేర్చుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు స్వీకరించడంతోపాటు సమగ్ర విచారణ జరిపి త్వరగా కేసులు నమోదయ్యేలా చూడాలన్నారు. కేసులవిషయంలో నిర్లక్ష్యంవహించే అధికారులపట్ల కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌పరిధిలో వేసవికాలం దృష్ట్యా పెట్రోలింగ్, బ్లూ కోర్ట్స్ రాత్రిసమయంలో ఎక్కువ చేయాలని, సస్పెక్ట్, రౌడీ, కెడి, సిడిలను తనిఖీలు చేయడంతోపాటు వారిపై నిఘా ఉంచాలన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ లాంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సిసి కెమేరాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలన్నారు. రోడ్లపై రైతులు ధాన్యం ఆరబోయకుండా చూసుకోవాలని తద్వారా జరిగే నష్టాలను వివరించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో డ్రగ్స్, సైబర్‌నేరాలపై, ఆత్మహత్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌వోపిల ద్వారా కేసుల పరిశోధన ఉండాలని ప్రతి కేసులో పరిశోధన పారదర్శకంగా ఉండాలన్నారు. పోక్సో, క్రైమ్ అగ్నెస్ట్ ఉమెన్ కేసులలో దోషులకు వెంటనే శిక్ష పడేలా చూడాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపాలని బ్లూకోర్టు, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరాయంగా విధుల్లో ఉండాలన్నారు. 100 డయల్ రాగానే రెస్పాండ్ అవ్వాలని సాధ్యమైనంత త్వరగా సంఘటన స్థలాల వద్దకు చేరుకోవాలన్నారు. సమావేశంలో సిద్దిపేట ఎసిపి మధు, సిఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీనివాస్‌తోపాటు రామకృష్ణ, శ్రీధర్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## పాకిస్తాన్‌కు వత్తాసు పలికిన ఎమ్మెల్యే అరెస్టు హర్షణీయం
**-బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్రసభ్యులు అరుణ్‌రాజ్‌శేరికార్**



అస్సాంలో ఎమ్మెల్యేను అరెస్టు చేస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
పాకిస్తాన్‌కు వత్తాసు పలికిన అస్సాం రాష్ట్రంలోని మంకాచార్ నియోజకవర్గ ఏఐయుడిఎఫ్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాంను అరెస్టు చేసి దేశద్రోహం కేసు నమోదు చేయడం అభినందనీయమని భారతీయ జనతా పార్టీ ఓబిసిమోర్చా రాష్ట్ర ఇసి సభ్యులు అరుణ్‌రాజ్‌శేరికార్ ఆనందం వ్యక్తంచేశారు. జమ్మూకాశ్మీర్ పహల్‌గాంలో ఉగ్రదాడిని ఖండించాల్సి ఉండగా పాకిస్తాన్‌కు వత్తాసు పలకడంపై వచ్చిన ఆరోపణలపై సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ కావడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎమ్మెల్యేను అరెస్టు చేయడంతో పాటు దేశద్రోహం కేసు నమోదు చేయడం ఆరాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మకు భారత దేశంపై ఉన్న మమకారాన్ని చాటుతుందన్నారు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో అయినా భారతమాతను కించపర్చిన బద్మాష్‌గాళ్లను, జాతీయ గీతం పాడని దురహంకారులను, జాతీయ జెండాకు సెల్యూట్ చేయని సన్నాసులు ప్రభుత్వ ఉద్యోగులైతే సస్పెండ్ చేయాలని జీఓ జారీ చేయాలని, ఉద్యోగస్థులు కాకుంటే కేసు నమోదు చేసి అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి వినతిచేస్తున్నట్లు అరుణ్‌రాజ్‌శేరికార్ సూచించారు.

## మండుటెండలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా



మండుటెండలో ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

**చౌటకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
తమ లక్ష సాధన కొరకు 40 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయకుండా సెలవు రోజు అయిన జెఎన్టీయూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ధర్నాకు దిగడం తప్పలేదు. గత 8రోజులుగా 12 యూనివర్సిటీల కో-ఆర్డినేటర్ కమిటీ పిలుపు మేరకు విధులకు హాజరు కాకుండా నిరవధిక సమ్మె కొనసాగుతున్న విషయం పాఠకులకు విదితమే. అధ్యాపకులు గౌరవం కోరుతున్నాం, కనికరం కాదు అనే నినాదాలతో ఉద్యోగుల కళాశాల గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చేసిన హామీని అమలుచేయాలని డిమాండ్‌చేస్తున్నామని, తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామన్నారు. విద్యావ్యవస్థపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విచారం వ్యక్తం చేశారు. తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్‌చేశారు.

## ర్యాకల్ ఎల్లమ్మను దర్శించుకున్న జిల్లా నాయకులు

**నారాయణఖేడ్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**
నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ మండల్ ర్యాకల్ గ్రామంలో అత్యంత శక్తివంతమైన ర్యాకల్ ఎల్లమ్మ జాతరలో జిల్లా నాయకులు పాల్గొని ఎల్లమ్మను దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీసభ్యులు సుధాకర్‌రెడ్డి, దారం శంకర్, మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. వారితో పోలీస్ పటేల్ విఠల్‌రెడ్డి మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, మాజీఉపసర్పంచ్ విట్టల్‌రెడ్డి, రాంరెడ్డి, భూమ్‌రెడ్డి, గ్రామస్థులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపేటలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం




ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న సిపిఐ నాయకులు

**సదాశివపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు తాజొద్దీన్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులుజరిపి ప్రాణాలను బలిగొనడం హేయమైన చర్యగా అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం నిఘా వైఫల్యం మూలంగానే ఉగ్రవాదులు జమ్ముకాశ్మీర్‌లోకి ప్రవేశించారని, ఉగ్రవాదులు భారతదేశంలోకి ప్రవేశిస్తుంటే కేంద్ర నిఘాసంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రెహ్మాన్, నాయకులు షఫీ అహ్మద్, ముస్తాఫా, పాండు, వెంకట్‌గౌడ్, ప్రియాంక, శంకరమ్మ, జ్యోతి, సాదిక్ అలీ, బిపాషా తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ ఫ్లెక్సీలను తొలగించడం అప్రజాస్వామికం
**-బిఆర్‌ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి**



విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరు పట్టణంలో బిఆర్‌ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన బిఆర్‌ఎస్ ఫ్లెక్సీలను శుక్రవారం రాత్రి జిహెచ్‌ఎంసి డిఆర్‌ఎస్ సిబ్బంది తొలగించడం అప్రజాస్వామికమని బిఆర్‌ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ఖండించారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌తో కలిసి ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్‌లో నిర్వహిస్తున్న బిఆర్‌ఎస్ రజతోత్సవసభ ఫ్లెక్సీలను తొలగించడం దారుణమని దుయ్యబట్టారు. శుక్రవారం అర్ధరాత్రి బిఆర్‌ఎస్ ఫ్లెక్సీలను తొలగించినవారిపై కేసులు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీకార్పొరేటర్ తొంట అంజయ్య, యువనాయకులు చిన్న, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

## ఆర్‌వైవి ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాలను అందచేయాలి
**-దరఖాస్తుదారులకు ఎంపిడిఓ శంకర్ సూచన**

**చౌటకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
రాజీవ్‌యువవికాస్‌పథకంలో లబ్ధిపొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నవారు దరఖాస్తుపత్రాలను మండలపరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఎంపిడిఓ శంకర్ సూచించారు. శనివారం ఎంపిడిఓ శంకర్ మాట్లాడుతూ సోమవారం సాయంత్రంవరకు ఆన్‌లైన్ దరఖాస్తుదారులు దరఖాస్తుపత్రంతోపాటు పాస్‌పోర్టుసైజ్‌ఫోటో, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, బ్యాంక్‌ఖాతా పుస్తకం, ఆన్‌లైన్‌ఫాంను, విద్యార్హత పత్రం, వికలాంగులైతే వికాంగుల ధృవీకరణపత్రం, మోటారు సెక్టార్‌కు దరఖాస్తు చేసుకుంటే డ్రైవిల్ లైసెన్స్‌లను జతచేసి మండలపరిషత్ కార్యాలయంలో అందచేయాలని ఎంపిడిఓ శంకర్ సూచించారు.

# కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు...!?

**-విద్యాసంవత్సరం మొదలుకాక ముందే అడ్మిషన్లకు తీరుగుతున్న పాఠశాలు**
**-ఇప్పుడే అడ్మిషన్లు తీసుకుంటే ఫీజులలో రాయితీ ఇస్తామంటూ తల్లితండ్రులకు ఎర**
**-బ్రాండ్ పేర్లను చెప్పుకుంటూ అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు**
**-అడ్మిషన్లకోసం టీచర్లకు టార్గెట్..లేకుంటే ఉద్యోగానికి ఎసరు పెడతామంటూ బెదిరింపులు**

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
హుస్నాబాద్‌లో గత కొద్ది సంవత్సరాల క్రితం వెలసిన కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల కోసం అడ్డదారిన ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరం పూర్తయి వారం తిరగక ముందే ముందస్తు అడ్మిషన్లపేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టే ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నాయి. టెక్నో, ఈటెక్నో, స్మార్ట్ అంటూ రకరకాల పేర్లతో అధికఫీజుల వసూళ్లపర్వానికి తెర లేపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా సాగుతున్న హుస్నాబాద్ కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. పాఠశాలల్లో ముందస్తుగా సీట్లు బుక్ చేసుకుంటే పాఠశాలల్లో చేరే విద్యార్థులకు రాయితీ ఇస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆశ చూపెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలో నిర్ణీత ఫీజుల పట్టిక ఏర్పాటుచేసి విద్యా సంవత్సరం ముగిసాక వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో అడ్మిషన్లు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ పట్టణంలోని కొన్ని పాఠశాలలు మాత్రం చెట్టు పేరుచెప్పి కాయలు అమ్ముకునే రీతిలో వ్యవహరిస్తున్నాయి. బ్రాండ్ పేర్లను చెప్పుకుంటూ అనుభవమున్న అధ్యాపకులతో విద్యాబోధన చేయిస్తున్నామని ప్రచారం చేస్తూ, ఎలాంటి అనుభవం లేని కనీస అర్హత లేని అధ్యాపకులచే విద్యాబోధన చేయిస్తూ అడ్డగోలుగా ఫీజులు వసూళ్లు చేస్తున్నాయి. నిబంధనలుపాటించని పాఠశాలల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వారి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. నర్సరీ నుండి 10వ తరగతి వరకు ముందస్తు అడ్మిషన్లకుతెరలేపి నర్సరీకే రూ. 20వేల నుండి 30వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. వారి విద్యాసంస్థలలో కనీస వసతులు లేకున్నా వేలల్లో ఫీజులు వసూళ్లు చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా చితికి పోతున్నారు.

**నూతన అడ్మిషన్లకు టీచర్లకు టార్గెట్...**
పట్టణంలో కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్‌లలో పని చేస్తున్న టీచర్లకు పాఠశాలల యాజమాన్యాలు నూతన అడ్మిషన్లు తీసుకురావాలని టార్గెట్లు పెడుతున్నారు. ఒక్కో టీచర్ కనీసం 10 మంది నుండి 15మంది అడ్మిషన్లు చేయించాలని ఒత్తిడి తెస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తెలుస్తోంది. ఇచ్చిన టార్గెట్లు పూర్తిచేయాలని చేయకుంటే ఉద్యోగానికి ఎసరు పెడుతామని బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లకు యాజమాన్యం పెట్టిన టార్గెట్లను చేరుకునేందుకు తీవ్ర ఎండలో సైతం ప్రయివేట్ ఉపాధ్యాయులు హుస్నాబాద్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలలో తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్‌నంబర్లు తీసుకుని వారి పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవాలని ఫోన్లుచేస్తూ విసిగిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఏది ఏమైనా ఈవిషయంపై విద్యాశాఖ అధికారులు ఏవిధంగా వ్యవహరిస్తారో వేచిచూడక తప్పదు.

## ఆడపిల్లల కన్నతల్లులకు నస్తీపూర్లో సన్మానం

**హత్నూర, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
నస్తీపూర్ వెలుగు గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఆడపిల్లలను కన్న 8మంది తల్లులకు శనివారం సన్మానం చేశారు. తల్లీపిల్లలకు నూతన వస్త్రాలతోపాటు ఆపిల్లల పేర్లమీద సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ఒక్కో అమ్మాయికి వెయ్యి రూపాయల చొప్పున ఖాతాలో జమ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సువర్ణ, సిసి కల్పన, విఓఎ ప్రవీణ్, మాజీఅధ్యక్షులు, గ్రూప్‌లీడర్‌లు ఆడపిల్ల కన్నతల్లులు పాల్గొన్నారు.

## పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలి

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పకుండా ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ పిల్లల తల్లిదండ్రులను కోరారు. శనివారం చిన్నశంకరంపేట మండలపరిధిలోని సూరారం తండాలలోని అంగన్వాడీకేంద్రాలలో పూర్వ బాల్యదశ, సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ అంజమ్మ మాట్లాడుతూ 3సంవత్సరాలను పూర్తి అయిన ప్రతిచిన్నారిని అంగన్వాడీకేంద్రానికి పంపాలని కోరారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఆటపాటలతో ఒత్తిడిలేని విద్యను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు స్వప్న, అనిత, సిబ్బంది రేణుక, యాదమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ షీటీమ్ హెడ్‌కానిస్టేబుల్ సదయ్య అన్నారు. శనివారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌పరిధిలోని మహిళారక్షణకోసం ఉన్నచట్టాలను గురించి వివరించారు. షీటీమ్ ద్వారా ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి తెలిపారు. మహిళలు, ప్రజలు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, సోషల్‌మీడియాకు ఎంతదూరం ఉంటే అంత మంచిదన్నారు. ప్రతి తల్లిదండ్రులు వారిపిల్లల నడవడికను గురించి ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే, అవహేళనగా మాట్లాడితే డయల్ 100లేదా 8712667434 నెంబర్లకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రశాంతి, కృష్ణతోపాటు తదితరులు ఉన్నారు.

## సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఎస్ఐ



సంపత్‌రెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న సిఐ శ్రీనివాస్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన బి.సంపత్‌రెడ్డి శుక్రవారం ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. ఏఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన సంపత్ శనివారం హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్‌తోపాటు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కోండ్ర శ్రీనివాస్, స్థానిక ఎస్ఐ తోట మహేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అధికారులు సంపత్‌కు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ రానున్నరోజుల్లో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు.

## అంగన్వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్‌డే




గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న మాజీకౌన్సిలర్ మల్లికార్జున్

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
సిద్దిపేట పట్టణంలోని 28వవార్డులోని అంగన్వాడీకేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీకౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్ పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీకేంద్రాల్లో పంపిణీచేసే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణీలు తీసుకోవాలని తెలిపారు. అలాగే మూడుసంవత్సరాలు దాటిన చిన్నారులను కూడా అంగన్వాడీకేంద్రాల్లో చేర్పించాలన్నారు. వేసవి కాలంలో చిన్నారుల తల్లిదండ్రులు వారిపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు బాల్‌లక్ష్మి, విజయలక్ష్మి, కవిత పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్ కార్యాలయాన్ని తనిఖీచేసిన ఆర్‌డిఓ



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేస్తున్న ఆర్‌డిఓ అశోక్‌చక్రవర్తి

**మనూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మనూర్‌లోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆర్‌డిఓ అశోకచక్రవర్తి తనిఖీచేశారు. కార్యాలయంలోని ఆయా గదులలో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ రికార్డులను అధికారులు సక్రమంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్‌కుమార్, ఆర్‌ఐ శంకర్‌రెడ్డి, రాచందర్, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనోద్దిన్, తిరుమల నర్సింహారెడ్డి, రాఘురాం తదితరులు ఉన్నారు.

## ఆసుపత్రిని తనిఖీచేసిన న్యాయమూర్తి



ఏరియా ఆసుపత్రిని తనిఖీచేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవితదేవి

**జహీరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రినికి శనివారం లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవితదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను, ఆసుపత్రిలోని ఆయా వార్డులను కలియ తిరిగి అక్కడిరోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. రోగులకు అందచేస్తున్న వైద్యసేవలపై ఆసుపత్రి వైద్యులు న్యాయమూర్తికి వివరించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.